
సాక్షి ఒడిశా

శుక్రవారం । 17 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,31,814లు, బంగారం 850 మిల్లీగ్రాములు, వెండి 130 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మల్కన్‌గిరిలో సందడి

మల్కన్‌గిరిలో తెలుగు వారు సందడి చేశారు. సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

- 8లో.



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

రాయగడలో వార్షిక క్రీడలు ఉత్సాహంగా జరిగాయి. క్రీడాకారులు రాణించారు.


- 8లో.

ఫొటో తీయాలంటే ..
లైసెన్సు ఉండాల్సిందే

- కోణార్క్ సూర్య దేవాలయం ఫొటోగ్రాఫర్లు, గైడ్‌లకు ఏఎస్‌ఐ లైసెన్సు తప్పనిసరి
- ఒడిశా హైకోర్టు స్పష్టీకరణ

భువనేశ్వర్:

ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ సూర్య దేవాలయంలోని ఫొటోగ్రాఫర్లు, గైడ్‌లుకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని, వీరికి కనీస విద్యార్హత మెట్రిక్యులేషన్ ఉండాలని ఒడిశా హై కోర్టు ఆదేశించింది. జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్‌లు, గైడులకు కనీస విద్యార్హతలు, లైసెన్సు వంటి షరతులతో 2017 సంవత్సరంలో ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. వీటిని సవాలు చేస్తు ప్రభావిత వర్గం రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆశ్రయించింది. ఈ వ్యాజ్యం విచారణ పురస్కరించుకుని లోగడ జారీ చేసిన మార్గదర్శకాల్ని ఉన్నత న్యాయ స్థానం సమర్థించి తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కోణార్కు సూర్య దేవాలయం పరిసరాల్లో ఫొటోగ్రాఫర్లు, గైడులు కనీస విద్యార్హతలతో భారత పురావస్తు శాఖ జారీ చేసే లైసెన్సు కలిగి ఉండడం తప్పనిసరిగా పేర్కొంది. దీంతో వివాదానికి తెర పడింది. 154 మంది లైసెన్స్ లేని గైడులు, ఫొటోగ్రాఫర్‌ల బృందం 2017 సంవత్సరంలో భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ జారీ చేసిన మార్గదర్శకాల్ని సవాలు చేసింది. హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్, జస్టిస్ సావిత్రి రాథోతో కూడిన ద్విసభ్య ధర్మాసనం లోగడ ఏక సభ్య ధర్మాసనం వెల్లడించిన తీర్పును సమర్థించింది. భారత పురావస్తు శాఖ విధానానికి కట్టుబడి ఉండవలసిన అవసరాన్ని ద్విసభ్య ధర్మాసనం పునరుద్ఘాటించింది. అనేక దశాబ్దాలుగా ఈ అర్హతలు లేకుండానే ఆలయంలో పనిచేస్తున్నందున కొత్త విధానాలు తమ జీవనోపాధికి ముప్పు తెచ్చాయని ప్రభావిత వర్గం ఆవేదన వ్యక్తం చేసింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(జి) ప్రకారం ప్రాథమిక హక్కులు సహేతుకమైన పరిమితులకు లోబడి ఉంటాయని కోర్టు పేర్కొంది. నిర్ణీత ఎంపిక ప్రక్రియ ద్వారా లైసెన్స్ పొందడం ఈ హక్కులను ఉల్లంఘించదని నొక్కి చెప్పిన ఢిల్లీ హై కోర్టు తీర్పుతో ఏకీభవిస్తు తాజా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం రక్షిత స్మారక కేంద్రాల్లో గైడ్‌లు, ఫొటోగ్రాఫర్‌లకు వర్తింపజేసే నిబంధనలతో భారత పురావస్తు శాఖ కోణార్కు సూర్య దేవాలయం గైడులు, ఫొటోగ్రాఫర్లకు సంబంధించి మార్గదర్శకాల్ని జారీ చేసినట్లు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ధర్మాసనం గుర్తించింది. ప్రఖ్యాత స్మారక పర్యాటక కేంద్రాల్లో వృత్తి నైపుణ్యం, క్షేత్ర ప్రాముఖ్యత పరిరక్షణ కోసం ఈ మార్గదర్శకాలు ప్రామాణికంగా కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో కోణార్క్ సూర్య దేవాలయం ప్రాంగణంలో గైడులు, ఫొటోగ్రాఫర్లుగా పనిచేయడానికి అందరూ ప్రస్తుత ప్రామాణికలకు కట్టుబడి ఉండాలని హైకోర్టు పేర్కొంది. వీటి మినహాయింపు అభ్యర్థనని ధర్మాసనం తోసిపుచ్చింది. ఇప్పటి వరకు భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ తాజా మార్గదర్శకాల ప్రకార ప్రకారం కోణార్క్ సూర్య దేవాలయంలో పని చేసేందుకు 10 మంది గైడులు, ఫొటోగ్రాఫర్‌లకు లైసెన్స్‌లు జారీ చేసింది. హై కోర్టు తాజా ఉత్తర్వులతో ఈ ప్రక్రియ మరింత చురుగ్గా ముందుకు సాగుతుంది.



కోణార్క్ సూర్య దేవాలయం

న్యూస్‌రీల్

రేపటి నుంచి చిలికా పక్షుల లెక్కింపు



భువనేశ్వర్: చిలికా సరస్సు పక్షుల ఆగమనంతో కళకళలాడుతోంది. మరోవైపు పర్యటకుల సందర్శనతో కిటకిటలాడుతోంది. దీంతో ఈనెల 18 నుంచి పక్షుల లెక్కింపు చేపట్టనున్నట్లు అటవీ విభాగం అధికారులు తెలియజేశారు. సువిశాల ఈ సరస్సులో ఉన్న పక్షులను లెక్కించేందుకు 5 రేంజులుగా విభజించారు. ఈ రేంజుల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పక్షుల గణన చేపడతారు. రంభ, బాలుగాంప్, టంగి, సత్తాపాడా, చిలికా 5 రేంజుల్లో పక్షులను లెక్కిస్తారు. దీనికోసం 21 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 4 నుంచి 5 మంది వరకు సభ్యులు ఉంటారని మండల అటవీ శాఖ అధికారి తెలిపారు. అలాగే సత్తాపాడా తీరంలో ఈనెల 20 నుంచి 22 వరకు డాల్ఫిన్ల లెక్కింపు కొనసాగనుంది.

మద్యం దుకాణాన్ని తరలించాలి



వినతిపత్రం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

రాయగడ: స్థానిక సాయిప్రియ నగర్‌లోని విదేశీ మద్యం దుకాణాన్ని తరలించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్టు కార్యదర్శి దయానిధి ఖడంగ నేతృత్వంలో ట్రస్టు సభ్యులు ఎక్సైజ్ అధికారి సంజయ్ ప్రధాన్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. జనావాసాలు, విద్యా సంస్థలు, నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విదేశీ మద్యం దుకాణం ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి జి.బ్రహ్మాజి, జి.దామోదర్, అరుణ్ కుమార్, సాహు, గౌరి శంకర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: రహదారిపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించాలని జీఐఈటీ కులపతి డాక్టర్ వీఎల్‌ఎస్ శర్మ సూచించారు. జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. కొత్త బస్టాండ్ నుంచి గుణుపూర్ కళాశాల ఈ ర్యాలీ కొనసాగింది. వాహనదారులు నిబంధనలు పాటిస్తే ట్రాఫిక్ సమస్య దూరమవ్వడంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వాణి ప్రసాద్ నాయక్, ఘనిష్ట ప్రష్టి, డి.నిర్మల్ పటేల్, రంజన్ పండ, బి.ప్రియాంక, చిన్మయి రంజన్ స్వాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ప్రమాదానికి గురైన కారు

భువనేశ్వర్: కోణార్క్ సమీపంలో బుధవారం రాత్రి కారు ప్రమాదం జరిగింది. కోణార్క్ నిమాపడా బస్సీ బజార్ జుబై ఛొకొ సమీపంలో అదుపు తప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులు సందీప్ మహాపాత్రో మరియు సనాతన్ సేనాపతిగా గుర్తించారు. కారు కోణార్క్ నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తుండగా నిర్మాణ పనులు జరుగుతున్న రోడ్డుపై ఆగి ఉన్న కారును ఢీకొనకుండా ప్రమాదం నివారించే ప్రయత్నంలో అదుపు తప్పి చెరువులోకి వెళ్లింది. స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో చిక్కుకున్న 4 మంది ప్రయాణికులను బయటకు తీసి తక్షణమే గోప్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు వారిలో ఇద్దరు చనిపోయినట్లు ప్రకటించారు. గాయపడిన మిగిలిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వీరు ఇద్దరూ బాలాసోర్‌కు చెందినవారు. సహాయ చర్యలు తర్వాత దెబ్బతిన్న వాహనాన్ని కోణార్క్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోణార్క్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎన్‌ఈపీకి రాష్ట్ర పాఠ్య ప్రణాళిక సన్నాహాలు

భువనేశ్వర్: జాతీయ విద్యా విధానం - 2020 (ఎన్‌ఈపీ-2020) ప్రకారం రాష్ట్ర పాఠ్య ప్రణాళిక రూపకల్పన (ఎస్సీఎఫ్) పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం 16 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. భోపాల్ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్‌ఐఈ) మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నిత్యానంద ప్రధాన్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ రాష్ట్ర పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. జాతీయ పాఠ్య ప్రణాళిక మార్గదర్శకాల పరిధిలో స్థానిక ప్రాధాన్యత అనుగుణంగా జాతీయ విద్యా విధానం, 2020 (ఎన్‌ఈపీ-2020) అమలు కోసం రాష్ట్ర పాఠ్య ప్రణాళికల రూపకల్పన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ప్రత్యేక కార్యాచరణ. ప్రొఫెసర్ **నిత్యానంద ప్రధాన్ అధ్యక్షతన** పాఠశాల, సామూహిక విద్యా శాఖ అదనపు కార్యదర్శి కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎన్‌ఈపీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి సంప్రదింపులు, మొబైల్ యాప్ సర్వేలు, ఇతరేతర ప్రత్యేక ప్రక్రియ ద్వారా రాష్ట్ర పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేస్తారు. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం బుధవారం రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 అమలును అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఉర్రూతలూగించారు..

పర్లాకిమిడి: స్థానిక రాంనగర్‌లో హైటెక్ ప్లాజా గొండ్స్‌లో జరుగుతున్న పరలా కళా సంస్కృతి వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న మకర సంక్రాంతి వేడుకల్లో కనుమ రోజు ప్రముఖ సినీ గాయకుడు, దర్శకుడు ఆర్పీ పట్నాయక్ విచ్చేశారు. ఆయన తొలి చిత్రం నీకోసం (1999, చిత్రం, నువ్వునేను, సంతోషం తదితర తెలుగు చిత్రాల పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆయనతోపాటు విశాఖపట్నం నుంచి వచ్చిన గాయని యామినీ, అరుణ్ ఆర్పీ పట్నాయక్ స్వరపరచిన పాటలను పాడారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ ఒడిశాలోని జయపురం తన స్వగ్రామమని, రాయగడలో విద్యాభ్యాసం జరిగిందన్నారు. చిత్ర రంగానికి అతి సులువుగా ప్రవేశం జరిగిందని, అప్పుడు అన్ని గేట్లు తెరిచి ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశ, విదేశాల్లో సంగీత కచేరీలు, పాటలకు నేపథ్య గానం అందిస్తున్నట్లు తెలిపారు.



పాటలు పాడుతున్న చలన చిత్ర గాయకుడు ఆర్పీ పట్నాయక్

సైకిల్‌పై ..
మహాకుంభమేళాకు..

మల్కన్‌గిరి :

మల్కన్‌గిరి జిల్లా కేంద్రం నుంచి దినేష్ పట్నాయిక్ అనే వ్యక్తి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు గురువారం సైకిల్‌పై బయల్దేరారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి ప్రయాణం ప్రారంభించారు. 1100 కిలోమీటర్ల దూరాన్ని 11 రోజుల్లో చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



సైకిల్‌పై కుంభమేళాకు బయల్దేరిన దినేష్ పట్నాయిక్

హైవేపై ఏనుగుల అలజడి



జాతీయ రహదారిపై ఏనుగుల సంచారం

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా 53వ నంబర్ జాతీయ రహదారిపై ఏనుగులు గుంపు అలజడి రేపింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమీప మలాపురా గ్రామం అడవి నుంచి జాతీయ రహదారిపై ఏనుగులు గుంపు తరలి వచ్చి, స్థానికులను భయాందోళనకు గురి చేశాయి. కామాక్షనగర్, దుబురి కూడలి 53వ నంబర్ జాతీయ రహదారి వెంబడి మలాపురా గ్రామ సమీపంలో ఏనుగులు సంచరిస్తూ కనిపించాయి. వాటిని సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు అటవీశాఖ అధికారులు చేసిన కృషి ఫలించింది.

ఉప ముఖ్యమంత్రికి మాతృ వియోగం



లోభవతి పరిడా (ఫైల్)

భువనేశ్వర్: ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తల్లి లోభవతి పరిడా (89) అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం రాత్రి కటక్ నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు. లోభవతి పరిడా గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పూరీ జిల్లా నువాహట్టా నిభరణ నివాసి అయిన లోభవతి పరిడాకు ఐదురుగు సంతానం. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మూడో సంతానం. స్వగ్రామంలో నిర్వహించిన తల్లి అంత్యక్రియలకు ప్రభాతి పరిడా హాజరయ్యారు.

అలరించిన గాన లహరి



వేదికపై ముఖ్యఅతిథి వర్మ తదితరులు





మృధుమధుర పాటలతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న గాయకులు

జయపురం: కొరాపుటియ కళాకార మంచ్ వారు నిర్వహిస్తున్న పుష్‌పుణి మహోత్సవ వేదికపై బుధవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఒడిశాలో సుప్రసిద్ధ గాయకులు అశీమా మృధుమదురంగా పాడిన పాటలు అశేష శ్రోతలను మైమరపించాయి. అనంతరం కొరాపుట్ జిల్లా ఆదివాసీ నృత్య సంగీతాలు కార్యక్రమంలో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అంజలీ దత్, పరేష్ శతపతి, ప్రియదర్శినిల సంగీతం శ్రోతలను మైమరపించింది. కార్యక్రమంలో సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, తహసీల్దార్ సవ్యసాచి జెన, సెంట్ జేవియర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్టీ శ్రీనివాస పటాన్నాయిక్, జిల్లా సాంస్కృతిక విభాగ అధికారి ప్రీతి సుధ జెన, జిల్లా టూరిస్టు విభాగ అధికారి తొలిన ప్రధాని అతిథులుగా పాల్గొన్నారు. పుష్ పుణి మహోత్సవ కమిటీ అధ్యక్షుడు మనోజ్ పాత్రో, కార్యదర్శి ధీరెన్ మోహన్ పట్నాయిక్,సభ్యులు జయంతి పట్నాయిక్,జయంత దాస్,శ్రీకాంత దాస్ ప్రితూష పట్నాయిక్ తదితరులు పర్యవేక్షించారు.



ఆదివాసీ డ్యాన్స్‌లు



పాటలతో అలరిస్తున్న కటక్ గాయకులు



పుష్‌పుణి మహోత్సవంలో పాల్గొన్న అశేష ప్రేక్షకులు

మునిగుడలో అండర్ గ్రౌండ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



రైల్వే అధికారులతో మంచ్ సభ్యులు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో గల టినికొనియా కూడలిలో రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ గ్రౌండ్ ఏర్పాటుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా గత ఏడాది నవంబరు 11న మునిగుడలో గల ప్రగతి మంచ్ ఆధ్వర్యంలో అండర్‌గ్రౌండ్ ఏర్పాటు చేయాలని ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన రైల్వే శాఖ ఈ మేరకు అండర్‌గ్రౌండ్‌ను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రగతి మంచ్ అధ్యక్షుడు సీహెచ్ గణేశ్వర రావు, సింహాచల్ పండా తెలియజేశారు. సంబల్‌పూర్ రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తున్న మునిగుడలో అండర్ గ్రౌండ్ ఏర్పాటుకు సంబంధించి రైల్వే డివిజన్ ఏఈ ఎన్ డి రవి, ఐఓడబ్ల్యూ రామారావులు గురువారం మునిగుడలో పర్యటించి అండర్‌గ్రౌండ్ నిర్మాణానికి సంబంధించి పర్యవేక్షించారు.

ఘనంగా కనుమ, ముక్కనుమ సంబరాలు

పర్లాకిమిడి:

పట్టణంలో సంక్రాంతి, కనుమ, ముక్కనుమ సంబరాలు మిన్నంటాయి. పలు కూడళ్లలో మహిళలు రంగవల్లుల పోటీలు, సవర్ల నృత్యం, జంగమయ్యలు ఇంటింటికి వెళ్లి గంటలు వాయించడం వంటి విశేషాలతో పండగ ఘనంగా జరుపుకున్నారు. అల్తి గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీలు సంప్రదాయకంగా నృత్యం చేస్తున్న సవర జాతి వారికి కోమటి వీధిలో ప్లాస్టిక్ బాల్టీలు, డబ్బులు పంపిణీ చేయడం విశేషం. ఇక గుసాని సమితిలో కనుమ నాడు జరిగే సీత కొండ జాతరకు చుట్టుపక్కల నుంచి యాత్రికులు పోటెత్తారు.



అల్తి గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీలు



నృత్యం చేస్తున్న ఆదివాసీలకు ప్లాస్టిక్ బకెట్‌ల పంపిణీ



దవిడిగాం నుంచి వచ్చిన జంగమయ్యలు



ఇంటి ముందు రంగవల్లులతో మహిళలు

క్లుప్తంగా

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: పలాస మండలం సవర రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సవర సోమేశ్వరరావును గురువారం కాశీబుగ్గ ఎక్సైజ్‌పోలీసులు అరెస్టు చేశారు. అతను వద్ద నుంచి 4లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అనంతరం రిమాండుకు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు మల్లికార్జునరావు ఈ విషయం చెప్పారు.

మిల్లు హెల్పర్ ఆత్మహత్య

గార: వాడాడ పరిధిలోని జొన్నలపాడు వద్ద నున్న ఓ రైసు మిల్లులో గురువారం బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన వికాస్ కుమార్ (20) ఊక గోడౌన్ గోడ స్తంభాలకు ఉరి వేసుకున్నాడు. తోటి మిల్లు ఆపరేటర్ గమనించి యజమానికి సమాచారం అందించాడు. పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడు వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామని, మరో ఆపరేటర్ సుకేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ఎం.చిరంజీవిరావు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్మీ ఉద్యోగుల విరాళం



ధనుపురంలో సర్పంచ్ ఢిల్లేశ్వరరావుకు నగదును అందజేస్తున్న ఆర్మీ ఉద్యోగులు

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామంలో శ్రీ చెవిటమ్మతల్లి (గ్రామదేవత)ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులందరూ కలిసి రూ. లక్షా 50 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం గ్రామ సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావుకు, గ్రామ పెద్దల సమక్షంలో నగదును ఆర్మీ ఉద్యోగులు అందజేశారు. ఆర్మీ ఉద్యోగులను గ్రామస్తులు అభినందించారు.

కొత్తమ్మ తల్లికి బంగారు కానుకలు



కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారికి బంగారు కానుకలు అందజేస్తున్న దాతలు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారికి దాతలు సుమారు లక్ష రూపాయల విలువైన బంగారు కానుకలను గురువారం అందజేశారు. కొత్తమ్మతల్లి అమ్మవారికి విశాఖపట్టణానికి చెందిన పిన్నింటి లిఖిత ఈ బంగారు కానుకలను అందజేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వి.రాధాకృష్ణకు వీటిని అందజేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాతపట్నం: పాతపట్నం మండలంలోని చిన్నలోగిడి గ్రామ సమీపంలో పూరి నుంచి గుణుపూర్ వస్తున్న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. పెద్దలోగిడి రైల్వే గేటు చిన్నలోగిడి తరణి ఆలయం మధ్యలో గురువారం రాత్రి 7.30గంటలకు పూరి నుంచి గుణుపూర్ వస్తున్న రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుంది. బ్లూ, బ్లాక్ టీ షర్ట్ నైట్ ఫ్యాంట్‌తో ఉన్నాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తి కాదని చిన్నలోగిడి గ్రామస్తులు చెబుతున్నారు. రైలు సుమారు 15 నిమిషాలు నిలిపివేయడం జరిగిందన్నారు.

వైద్యం పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరు: కొత్తూరుకు చెందిన సిల్లా చక్రవర్తి బుధవారం బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన రాగోలులోని జెమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ ఎండీ ఆమీర్ ఆలీ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పంచనామా, పోస్టుమార్టం చేసిన అనంతరం గురువారం మృతదేహాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

బంగారం చోరీ కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామానికి చెందిన నాయన గోవింద ఫిర్యాదు మేరకు బంగారం చోరీ కేసును ఎచ్చెర్ల పోలీసులు గురువారం నమోదు చేశారు. గత ఏడాది తొమ్మిదో నెలలో 10 గ్రాముల బంగారం చైన్ అదృశ్యమైంది, గుర్తించటంలో జాప్యంతో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యాన్స్ పోటీలో పాల్గొన్న మహిళలు





సంక్రాంతి ముగ్గు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న యువతి

మల్కన్‌గిరిలో తెలుగు వారి సందడి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో తెలుగు వారు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జైన్‌భవనంలో 3000మంది తెలుగు వారు గురువారం సంప్రదాయ దుస్తుల్లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.



వేదికపై యాంకర్స్



వేడుకల్లో పాల్గొన్న తెలుగు వారు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ముఖ్యఅతిథి, గౌరవ అతిథులకు స్వాగతం పలుకుతున్న నమిత ప్రధాన్

రాయగడ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్ ఉజ్వలంగా మారుతుందని బాలికల రెండో ఎన్‌సీసీ బెటాలియన్ లెఫ్టినంట్ కల్నల్ రాకేష్ చంద్ర భరత్‌వాల్ అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల 78వ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాశానికి ఎంతో దోహద పడతాయని



ముగింపు ఉత్సవాల్లో ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రదర్శన

అభిప్రాయం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన బాలికల ఎన్‌సీసీ రెండో బెటాలియన్ సుబేదార్ మేజర్ ఎస్.ఎం.రామానంద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌ను రూపొందించుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం నమిత ప్రధాన్ తన వార్షిక నివేదకలో భాగంగా ప్రతీ ఏడాది ఇటువంటి తరహా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు బుధవారంతో ముగిశాయన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఆసక్తిగా పలు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారన్నారు. పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు.



ముగింపు ఉత్సవాల్లో ఉపాధ్యాయులు, పీఈటీలు



హైజంప్ చేస్తున్న విద్యార్థి

నదిలో మట్టి తవ్వకాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి కేంద్రంగా వెళ్లే నాలుగు పంచాయతీలను కలిపే నది నుంచి ప్రతి రోజు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని అలుసుగా చేసుకుని మాఫియా నదిలో మిషన్ ద్వారా మట్టి తవ్వి లారీల్లో తరలిస్తున్నారు. దీనిపై మరివాడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరీ నాయక్‌ను ప్రశ్నించగా ఈ విషయం తెలియదని, తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నదిలో మట్టి కుప్పలు

రాష్ట్రస్థాయి పోటీలకు బిసంకటక్ ఎంపిక



బిసంకటక్ క్రీడాకారులతో మేనేజర్, కోచ్

రాయగడ: ఈ నెల 18 నుంచి పూరీలో ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని బిసంకటక్ జట్టు ఎంపికైంది. అండర్ 19 విభాగంలో ఈ జట్టు పాల్గొనుంది. 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. జట్టు కోచ్ సూరజ్ కుమార్, మేనేజర్ రోహిత్ దకువాల్ నేతృత్వంలో క్రీడాకారులు సన్నద్ధమవుతున్నారు. బిసంకటక్‌లో గల న్యూలైఫ్ ఇంగ్లిష్ విద్యాలయం, దుర్గీ ఆదర్శ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ జట్టులో ఎంపికైనట్లు మేనేజరు రోహిత్ తెలియజేశారు.

'ఓబీసీ కుల గణన సామాజిక న్యాయానికి సోపానం'

భువనేశ్వర్: సమగ్ర ఓబీసీ కుల గణనను నిర్వహించాలని, ఒడిశాలోని ఎస్ఈబీసీలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని ఓబీసీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్‌కు గురువారం బిజూ జనతా దళ్ నాయకుల సీనియర్ బృందం అభ్యర్థించింది. ఈ బృందం సమర్పించిన అభ్యర్థన పత్రంలో భారత దేశంలో సమగ్ర కుల గణనను నిర్వహించాల్సిన ఆవశ్యకతను సీనియర్ బిజూ జనతా దళ్ నాయకులు ఎత్తిచూపారు. సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) 2011 నివేదికలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతుల సంక్షేమ కార్యాచరణ నియమావళి, మార్గదర్శకాల రూపకల్పన, వనరుల సమాన పంపిణీకి అవసరమైన కీలకమైన కుల సంబంధిత డేటా లేదని బీజేడీ వివరించింది.



వెనుకబడిన వర్గాల సంక్షేమ పార్లమెంటరీ కమిటి అధ్యక్షునికి అభ్యర్థన పత్రం సమర్పించిన బీజేడీ నాయకుల బృందం

సామాజిక, ఆర్థిక, కుల గణన – 2011లో గ్రామీణ, పట్టణ, కుల గణనలు మూడు విభిన్న భాగాలు. గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర సమన్వయంతో వివిధ అధికారుల పర్యవేక్షణలో ఈ విభాగాల నిర్వహణ కొనసాగుతుందని, దీనికి అనుకూలంగా వివరణాత్మక సమాచారం, విశ్లేషణ లేకపోవడం వివిధ కుల సమూహాలలో సామాజిక, ఆర్థిక గతిశీలతను నిర్మాణాత్మకంగా బలోపేతం చేసే దిశలో నడిపించేందుకు ప్రధాన అంతరాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ అవాంతరం తొలగించి అట్టడుగు వర్గాలకు సంబంధించిన నిర్దిష్ట అవసరాలను తీర్చగల లక్ష్య విధానాల సూత్ర ఆవిష్కరణకు ఓబీసీ కుల గణన అనివార్యమని వివరించారు. వివిధ కుల సమూహాలలో గృహ నిర్మాణం, ఆదాయ వనరులు, విద్యా సాధన, ఉద్యోగ స్థితి వంటి రంగాల్లో అభివృద్ధికి ప్రామాణిక్ని రూపొందించేందుకు కుల గణన నివేదిక సమగ్ర సమాచారం అందించేలా కుల గణన ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని ప్రతిపాదించారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాలను మూల్యాంకనం చేయడానికి, సర్దుబాటు చేయడానికి కచ్చితమైన కుల సంబంధిత వివరాలు చాలా అవసరం. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో అట్టడుగున మగ్గిపోతున్న అత్యంత అవసరమైన సామాజిక వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు తాజా రిజర్వేషను వ్యవస్థ ఆవిష్కరణ అవసరంగా బీజేడీ ప్రతినిధి బృందం వివరించింది. బిజూ జనతా దళ్ నాయకులు ఓబీసీ సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీని ఓబీసీ కుల గణనను వెంటనే ప్రారంభించాలని అభ్యర్థించింది. ఒడిశాలోని సామాజిక, ఆర్థిక వెనుకబడిన వర్గాలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేయాలని అభ్యర్థించారు.



వెనుకబడిన వర్గాల సంక్షేమ పార్లమెంటరీ కమిటీ సమావేశం

హీరామణికి అభినందనలు



హీరామణి మఝిని సన్మానిస్తున్న సమితి అధ్యక్షుడు తదితరులు

జయపురం: ఇటీవల రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన ఆదివాసీ సుందరి పోటీల్లో బొయిపరిగుడ సమితి నువాపడ గ్రామం హీరామణి మఝి మూడో స్థానంలో నిలచి బహుమతి పొందిన విషయ విదితమే. గురువారం ఆమెను బొయిపరిగుడ సహిద్ లక్ష్మణ నాయిక్ ప్రతిమ వద్ద సమితి తరఫున ఘనంగా సన్మానించారు. బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రకాశ్ కుమార గుప్త, బొయిపరిగుడ బీడీఓ అభిమణ్యు కవి శతపతి, జిల్లా పరిషత్ సభ్యులు మణి జాని, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి నరేంద్ర కంధాలియ లతో పాటు గ్రామ ప్రజలు ఆమెకు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: ఈనెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం కిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు.. గార మండలం కొమరవానిపేట గ్రామానికి చెందిన మురముండ రాజు (25) శ్రీకాకుళం నగరం గోవిందనగర్ పెదపాడు రోడ్డు మీదుగా తన ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నగరంలోకి వస్తుండగా నరసన్నపేట నుంచి పెదపాడు మీదుగా వస్తున్న మహేంద్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ ఆయన బుధరాత్రి రాత్రి మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు.



మృతి చెందిన రాజు

క్రికెట్ విజేత పరలా డామినేటర్స్



జూనియర్ క్రాంతి నైట్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత డామినేటర్స్ క్రీడాకారులతో ఎమ్మెల్యే రూపేష్



క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్స్ డామినేటర్స్ టీమ్‌కు కప్, చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: గత 11 రోజులుగా (జనవరి 4 నుంచి 15వ తేదీ) ఎలుకలవీధిలో కొనసాగిన జూనియర్ క్రాంతి నైట్ క్రికెట్ టోర్నమెంట్ కనుమనాడు ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ తిలకించడానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్యఅతిథిగా విచ్చేసి తొలి బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఫైనల్స్‌లో పర్లాకిమిడి డామినేటర్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. మొత్తం 10 ఓవర్లకు 88 రన్స్ చేశారు. దేశీ బాయ్స్ వారికి ధీటుగా పది ఓవర్స్‌లో 87 బంతులు చేసి ఔటాయ్యారు. ఈ ఉత్కంఠ పోరు పర్లాకిమిడి డామానేటర్ జట్టు విన్నర్ కప్పుతోపాటు రూ.11,111/– కైవసం గెలుచుకోగా, రన్నర్స్‌గా దేశీబాయ్స్‌కు రూ.8000లు, కప్‌ను ఎమ్మెల్యే అందించారు. ఈ టోర్నమెంట్‌కు 15వ వార్డు కౌన్సిలర్ బంటి, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిని ఆహ్వానిస్తున్న క్రాంతి క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు

వేటకు వెళ్లి.. విగత జీవిగా మారి



గడ్డెయ్య (ఫైల్)

గార: బందరువానిపేటలో ఓ మత్స్యకారుడు వేటకు వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కుందు గడ్డెయ్య (41) గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వేటకు వెళుతున్న సమయంలో రాకాసి అలలు రావడంతో పడవ నుంచి సమీపంలో తుళ్లి సముద్రంలో పడిపోయాడు. వలలు కూడా తనపై పడటం, అందులోనే చిక్కుకోవడంతో ఊపిరాడక చనిపోయాడు. భార్య బోడెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.చిరంజీవిరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు రిమ్స్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మత్స్యశాఖ అధికారులతో వివరాలు తెలుసుకుని, వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వం మృతిని కుటుంబానికి అండగా ఉంటామని ఆ ప్రకటనలో తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

విశాఖలో చౌఖుపేట వాసి మృతి

సోంపేట: మండలంలోని బుసాబద్ర పంచాయతీ చౌఖుపేట గ్రామానికి చెందిన ఎం.రాజ్‌కుమార్ విశాఖ రైల్వేస్టేషన్‌లో గురువారం మృతి చెందినట్లు సోంపేట పోలీసులు తెలిపారు. రాజ్‌కుమార్ చౌఖుపేట గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. భార్య రాజ్యలక్ష్మి విశాఖపట్నంలో నివాసం ఉంటోంది. పండగ సందర్భంగా రాజ్‌కుమార్ విశాఖ పట్నంలోని భార్యపిల్లల వద్దకు వెళ్లాడు. పండగ అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతికి గల పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు విశాఖ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సోంపేట పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

రెండో ఆటోలు బోల్తా


ఆటో ప్రమాదంలో గాయాల పాలైన క్షతగాత్రులు

సీతంపేట: పండగపూట సీతంపేట ఏజెన్సీలో విహార యాత్రకు వచ్చిన పర్యాటకులకు విషాదం మిగిలింది. ఆడలి వ్యూపాయింట్ ఘాట్ రోడ్‌లో రెండు ఆటోలు గురువారం సాయంత్రం వేర్వేరుగా బోల్తా పడిన సంఘటనలలో 15 మందికి గాయాలయ్యాయి. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం వాటపాగు, బూర్జమండలం కురుంపేటలకు చెందిన గ్రామస్తులు ఆడలి వ్యూపాయింట్ చూడడానికి ఆటోల్లో వేర్వేరుగా వెళ్లారు. తిరిగి వస్తుండగా వెలంపేట మలుపు వద్దకు వచ్చేసరికి కురుంపేటకు చెందిన ఆటోను వెనుక వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో లోయలో బోల్తాపడింది. పలువురికి గాయాలయ్యాయి. అక్కడే నిల్చుని ఉన్న వెల్లంగూడకు చెందిన గిరిజనుడైన సవర రెల్లయ్యపై ఆటో పడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాగా వాటపాగు గ్రామానికి చెందిన మరో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆ ఆటోలో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలయ్యాయి. రెండు ఆటోల్లో క్షతగాత్రులైన ఎం.రామ్మూర్తి, కె.రోహన్, చిరంజీవి, ఇందుమతి, హేమంత్, యశోద, సంజన, వెంకటలక్ష్మి, చిన్న, సూర్యనారాయణ, అప్పలనాయుడు, అభి తదితరులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించిన యామిని, రెల్లయ్యలను శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన వైద్యసేవలకు తరలించారు. ఎస్సై వై.అమ్మన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడులు


కోడిపందాలపై దాడులు నిర్వహించిన ఎస్సై దామోదరరావు, సిబ్బంది

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి గ్రామ పరిసరాల్లో నిర్వహిస్తున్న కోడి పందాలపై ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. కోడి పందాలు ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తుల నుంచి రూ.15,280 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఆరు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దామోదరరావు తెలిపారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా కోడి పందాలు ఆడుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


సూర్యనారాయణ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: తీసుకున్న అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడలో జరిగిన ఈ ఘటనపై ఎస్సై గణేష్, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టి. సూర్యనారాయణ(26) విజయనగరం పట్టణంలో ఒక బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన అవసరాల కోసం అప్పులు చేసి వాటిని తీర్చలేక మనస్తాపంతో ఈ నెల 14న గ్రామ శివారులోని మామిడి తోటలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఘటనా స్థలం నుంచి ఇంటికి వెళ్లిన సూర్యనారాయణ వాంతులు చేసుకోవడంతో తల్లి ప్రశ్నించగా..జరిగిన విషయం చెప్పాడు. చికిత్స నిమిత్తం వెంటనే విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు కనకరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన్ మాన్ పనులు వేగవంతం చేయాలి

పార్వతీపురం టౌన్: జన్ మాన్ పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో పీఎం జన్ మాన్ కార్యక్రమంలో భాగంగా జల్ జీవన్ మిషన్, అంగన్‌వాడీ, ఆవాస్ యోజన, రహదారులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగు నీరు అందించాలని ఆయనన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, ప్రాథమిక విద్య పట్ల ఆసక్తి కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు. గిరిజనులు అందరికీ ఇళ్లు నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. మంజూరైన ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. సమావేశానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి విజయగౌరి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త వల

- యువతే లక్ష్యంగా మోసాలు
- రకరకాల కాల్స్ పేరుతో వివరాల సేకరణ
- రూ.వేల నుంచి రూ.లక్షల వరకు దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



పార్వతీపురంటౌన్: యువతే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. ఉద్యోగాల పేరిట, బ్యాంకు అకౌంట్ ఈకైవైసీ, సిమ్‌కార్డ్ డీయాక్టివేషన్, ఎలక్ట్రిసిటీ ఈకేవైసీ తదితర అంశాలపై గాలం విసిరి రూ.లక్షల్లో దోచేస్తున్నారు. పార్ట్‌టైం జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై ఆన్‌లైన్ నకిలీ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చదువుకున్న వారే. పలు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ వంటి సాంకేతిక విద్యనభ్యసించిన నిరుద్యోగులు ఎక్కువగా మోసపోతుండడం గమనార్హం. గత ఏడాది 474 మంది బాధితుల నుంచి రూ.2.79 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచుకోగా పోలీసులు అప్రమత్తమై రూ.46,80,297 స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

బయోడేటా సేకరించి కాల్స్

ప్రముఖ ఆన్‌లైన్ జాబ్ సెర్చ్ ఇంజిన్లలో ఇచ్చిన బయోడేటా ఆధారంగా నిరుద్యోగుల సమాచారం సేకరించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారికి మెయిల్స్ పంపిస్తారు. అవసరమైతే కాల్ చేస్తారు. ఇంటర్వ్యూ పేరుతో మోసం చేస్తారు. రకరకాల ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబడతారు. జాబ్ వచ్చేసినట్లేనని నమ్మిస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజులు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుంటారు.

వర్క్ ఫ్రం హోం పేరుతో..

చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసే వాళ్లు వారినే ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించవచ్చని నమ్మించి నగదు దోచేసి నేరగాళ్లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేస్తున్నారు. కొందరైతే డేటా ఎంట్రీ పని ఉందని, ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, చాలా ఎక్కువ డబ్బులిస్తామని నమ్మిస్తారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళ్తామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నకిలీలను ఇలా గుర్తించాలి..

- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు వసూలు చేయవు
- ప్రకటనల్లోని లోగో లెటర్లను గమనించాలి
- జాబ్ స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిల్స్ గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి
- నేరగాళ్ల ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా స్పష్టంగా ఉండదు
- క్విక్ మనీ, అన్‌లిమిటెడ్ ఎర్నింగ్స్, స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తం కావాలి
- 1930 సైబర్ సెల్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు



సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాల్లో కొంతమంది చదువుకున్న యువత మోసపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఉద్యోగాలకు డబ్బులివ్వడమేమిటనే ఆలోచన చేయాలి. యువత జాబ్ ప్రకటనలకు స్పందించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. పూర్తి సమాచారం తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.

–ఎస్.వీ.మాధవ్ రెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం

జీడి పప్పు ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో జీడిపప్పు ప్రాసెసింగ్ కేంద్రాలను సాలూరు, గుమ్మలక్ష్మీపురం, కురుపాంలలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ పార్వతీపురం, వీరఘట్టంలలో గిడ్డంగులు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవచ్చని, అందుకు అవసరమైన యంత్ర పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాసెసింగ్ కేంద్రాలకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. సీతంపేట ప్రాంతంలో ఇప్పటికే ప్రాసెసింగ్ జరుగుతోం దని, వాటి ఆధారంగా లైసెన్స్ తదితర అంశాలను కూడా పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రాసెసింగ్ కేంద్రాలలో సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, సాలూరు, మక్కువలలో రెండు చొప్పున ప్రాథమిక ప్రాసెసింగ్ సెంటర్లు ప్రస్తుతానికి ఉన్నాయని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలను పాటించాలి


పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్

విజయనగరం అర్బన్: రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోరారు. అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని నిబంధనలను పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చునని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలని హితవు పలికారు. తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అయినా భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ తన చాంబర్‌లో గురువారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గురువారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన డ్రైవర్లకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్, ఆర్‌టీఓ విమల, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- చీరతో ఉరివేసి ఉన్న మృతదేహం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐలు


దండు సింహాచలం మృతదేహం,(ఇన్‌సెట్‌లో) సింహాచలం(ఫైల్)


సంఘటనా స్థలంలో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో బుధవారం రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దండు సింహాచలం(55) భర్త త్రినాథరావు తొమ్మిదేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె టీ కొట్లకు నీరు పెరగడం, గ్రామాల్లో నూనె, పిండి వడియాలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే ప్రతి ఏటా సంక్రాంతి పండగకు తన కన్నవారి ఊరు బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి గ్రామానికి వెళ్లేది. ఈ ఏడాది కూడా సంక్రాంతి పండగకు అన్నదమ్ములు పిలిచారు కానీ ఆమె వెళ్లలేదు. ఎందుకు తోబుట్టువు రాలేదా? అని అన్నదమ్ములు బుధవారం ఆమెకు ఫోన్ చేశారు. ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో కొట్టక్కిలో ఉన్న బంధువులకు ఫోన్ చేశారు. దీంతో సింహాచలానికి వరుసకు మేనల్లుడు అయిన మన్మథరావు, మరో ఇద్దరు మహిళలు కలిసి ఆమె ఇంటికి వెళ్లి తలుపు తీయగా ఇంటి లోపల ఫ్యాన్ కొక్కానికి చీర కట్టి ఉరివేసి కిందకి వెల్లకిలా పడి ఉంది. దీంతో అనుమానం వచ్చి వారు ఆమె అన్నదమ్ములకు సమాచారం ఇచ్చారు. వారు కొట్టక్కి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్సై వెలమల ప్రసాదరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం అనుమానాస్పద స్థితిలో ఉండడంతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ కె.నారాయణరావులకు విషయం తెలియజేశారు. సమాచారం మేరకు వారు రాత్రికి రాత్రే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గురువారం ఉదయం విజయనగరం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి డాగ్ స్క్వాడ్‌తో చెక్ చేశారు. మళ్లీ గురువారం ఉదయం కూడా డీఎస్పీ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఉన్న వారిని, స్థానికులను, బంధువులను ఆమెకు ఎవరైనా పగవారు ఉన్నారా?లేక డబ్బు బంగారం ఏమైనా ఉందా? అని ఆరాతీశారు. ఆమెకు ఎవరూ పగవారు లేరని, ఆమె కడు బీదరాలని, బంగారం,డబ్బు కూడా లేదని స్థానికులు డీఎస్పీకి వివరించారు. దీంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతురాలు నాలుగు అడుగుల ఎత్తు మాత్రమే ఉందని, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు లేదని, ఎవరైనా హత్యచేశారా? లేక ఆత్మహత్య చేసుకుందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

పింఛన్ పథకం..వేతనజీవులకు వరం

- 60 ఏళ్ల తరువాత పింఛన్ పొందే అవకాశం
- నమోదుచేసుకోవాలంటున్న అధికారులు
- రూ.15వేల లోపు వేతనదారులంతా అర్హులే


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న లేబర్ అధికారి

రాజాం సిటీ: ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి నెల పింఛన్ పొందే అవకాశం ఉద్యోగులకు ఉంటుంది. అదే రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందే అవకాశం లేదు. అందులో అసంఘటిత కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు కష్టపడి పనిచేసుకుంటూ జీవితాన్ని నెట్టుకువస్తున్న వారికి వయసు పెరిగేకొద్దీ ఓపిక నశించడంతోపాటు ఆరోగ్య సమస్యలు వెంటాడుతుంటాయి. ఇక వృద్ధాప్యంలో చేతిలో రూపాయిలేక అనేక అవస్థలు పడుతుంటారు. అలాంటి అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రప్రభుత్వం అండగా నిలుస్తోంది. మలి సంధ్యలో పింఛన్ రూపంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పేరిట 60 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ. 3వేలు చొప్పున ఏడాదికి రూ.36వేలు అందించనుంది.

కనిష్టంగా రూ.55..

18 నుంచి 40 ఏళ్లలోపు అసంఘటిత రంగ కార్మికులు వయసు ఆధారంగా నెలకు రూ.55 నుంచి గరిష్టంగా రూ.200 చెల్లించాలి. కేంద్రప్రభుత్వం అంతే మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తుంది. కార్మికుడికి 60 ఏళ్లు నిండిన తరువాత నెలకు రూ.3వేలు చొప్పున కేంద్రప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. లబ్ధిదారుడి మరణానంతరం జీవిత భాగస్వామికి 50 శాతం పింఛన్ వస్తుంది. పథకంలో చేరిన కొన్నాళ్లకు వైదొలగాలనిపిస్తే పొదుపు మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తారు. పథకంలో కొనసాగుతున్న సమయంలో మరణిస్తే వారి నామినీ సభ్యులుగా కొనసాగి ఆపైన పింఛన్ అందుకోవచ్చు.

కొరవడిన అవగాహన..

ఈ ఏడాది ప్రారంభంలో ఈ పథకం ప్రవేశపెట్టినా ఎన్నికలు రావడంతో ఈ పథకంపై అంతగా ప్రచారం నిర్వహించలేదు. అయితే ఈ పథకం ప్రారంభమైన విషయాన్ని కూడా అధికారులు తెలియపర్చకపోవడం శోచనీయం. దీంతో నష్టపోవాల్సి వస్తోందని పలువురు కార్మికులు వాపోతున్నారు. ఈ పథకం ఉందనే విషయం కూడా తమకు ఇంతవరకు తెలియదంటూ రాజాంలో పనికి వచ్చిన కూలీలు రామారావు, శ్రీనివాసరావు, రామినాయుడు తదితరులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీ సేవా కార్యాలయాల్లో ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ మొదటి పేజీ జిరాక్స్‌లు, మొబైల్ నంబర్ వివరాలు అందించి ఈ పథకంలో చేరవచ్చు. లబ్ధిదారులు నెలకు రూ.55 నుంచి రూ.200 వరకు 60 సంవత్సరాల వయసు వచ్చేవరకు చెల్లించాల్సి ఉంటుంది. 61వ సంవత్సరం నుంచి నెలకు రూ. 3వేలు చొప్పున పింఛన్ అందుకునే వీలుంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



అసంఘటిత రంగ కార్మికులకు ఎంతో భరోసాగా ఉండే ఈ పథకాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలి. అసంఘటిత రంగ కార్మికులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. ఆదాయపు పన్ను చెల్లించని వారే ఈ పథకానికి అర్హులు. కార్మికులు ఈ పథకానికి దరఖాస్తుచేసుకుని సద్వినియోగం చేసుకోవాలి. ఏవైనా సందేహాలు ఉంటే కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

బి.కొండలరావు, లేబర్ ఆఫీసర్, రాజాం

వీరు అర్హులు...

నెలకు రూ.15వేల లోపు జీతం పొందే వారంతా అసంఘటిత కార్మికులే. వారిలో వ్యవసాయ కూలీలు, పాడి పరిశ్రమ, రోల్డ్‌గోల్డ్ కార్మికులు, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత, కుమ్మరి, కమ్మరి, స్వర్ణకారులు, క్షౌ రవృత్తి, బ్యూటీ పార్లర్, చర్మకారులు, రజకులు, కలంకారీ, తోపుడుబండి, చిరు వ్యాపారులు, మెకానిక్ తదితర వర్గాలకు చెందిన వారు అర్హులు. అలాగే టైలర్లు, రిక్షా కార్మికులు, కళాకారులు, ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల్లో పనిచేసే స్వీపర్లు, కొరియర్ బాయ్స్, ముఠాకార్మికులు, డ్వాక్రా, ఆశ, విద్యావలంటీర్లు, అంగన్వాడీ, మెప్మా మహిళలు, డ్రైవర్లు, క్లీనర్లు, హోటల్స్, సినిమాహాల్స్, ప్రైవేట్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది, ప్రైవేట్ ఆస్పత్రిలో సహాయకులు ఈ పథకంలో చేరవచ్చు.

ముప్పై ఏళ్ల ఆదాయం: పామాయిల్‌తో సాధ్యం

- ఆయిల్‌పామ్‌కు ప్రత్యేక రాయితీలు
- ఉద్యానవన శాఖ ద్వారా విస్తరణ
- పామాయిల్ తోటల్లో అంతర పంటలకు ప్రోత్సాహం
- జిల్లాలో 6.4వేల హెక్టార్లలో సాగు
- మన్యం జిల్లాలో 2.5 వేల హెక్టార్లలో సాగు పెంపు లక్ష్యం


బత్తిలిలో పామాయిల్ గెలలు ఎక్కిస్తున్న కూలీలు


పొలంలో నాటిన పామాయిల్ మొక్కలు


రైతు నాటిన పామాయిల్ మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

భామిని: రోజుకురోజుకు పెరుగుతున్న నూనె వాడకానికి తగ్గట్లు నూనె గింజల పంటల ఉత్పత్తి పెరగడం లేదు. విదేశాల నుంచి నూనె గింజల దిగుబడిని తగ్గించడానికి స్థానిక రైతుకు ఆదాయం పెంచడానికి అనువుగా పామాయిల్ సాగుకు ప్రోత్సాహం పెరుగుతోంది. ముప్పై ఏళ్ల ఆదాయం వచ్చే అనువైన పంటగా ఆయిల్‌పామ్‌ను అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఆరోగ్యం కలిగించే ఆయిల్ పామ్ సాగు రైతుల ఆదాయాన్ని పెంచుతోంది. అత్యధిక నూనె దిగుబడి ఇచ్చే పంటల్లో ఒకటి పామాయిల్. హెక్టారుకు 20 టన్నుల గెలల దిగుబడి వస్తుంది. అలాంటి ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రత్యేక రాయితీలను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 6.4వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 2024-25వ సంవత్సరానికి మరో 2.5వేల హెక్టార్లలో సాగు పెంపు లక్ష్యంగా కార్యాచరణ చేపట్టారు. జిల్లాలో నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్‌పామ్ ద్వారా ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూరుస్తోంది. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు శ్రీనివాస ఆయిల్ పామ్ కంపెనీ మొక్కలు పంపిణీ చేస్తోంది. ఈ మొక్కలు ఎకరా విస్తీర్ణంలో త్రిభుజాకారంలో 57 నాటుతారు. నీటి వసతి బోరు, గెడ్డ, నీటి కాలువ సౌకర్యం ఉన్న రైతులకు మొక్కలు మంజూరు చేస్తారు. జిల్లాలో పండించే పామాయిల్ పంటను నేరుగా శ్రీనివాస పామ్ ఆయిల్ కంపెనీ వారే రైతు దగ్గరకు స్వయంగా వచ్చి కొనుగోలు చేస్తారు. పంట రవాణా ఇబ్బంది కూడా రైతుకు ఉండదు. ఉద్యానవన శాఖ మూడేళ్ల పాటు పంట నిర్వహణ ఖర్చులు రైతు ఖాతాకు జమ చేస్తుంది.

ఇవీ ప్రయోజనాలు

- ఏడాది పొడవునా నెలసరి ఆదాయం, మార్కెట్ ధరకు హామీ ఉంటుంది.
- పామాయిల్ పంటకు దొంగల భయం ఉండదు. ఇతర అవసరాలకు ఉపయోగపడదు.
- ఆయిల్‌పామ్ పంటలో తెగుళ్లు, వ్యాధులు చాలా తక్కువ మొదటి మూడేళ్లలో ఏక వార్షిక పంటలైన కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ వంటివి అంతర పంటలుగా వేసుకోవచ్చు. ఆ తర్వాత నీడను ఇష్టపడే పంట కోకో వంటి అంతర పంట సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.
- ఆయిల్ పామ్ 4–6 ఏళ్లు గల తోట నుంచి ఎకరాకి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది
- పామాయిల్ పంటతో ముప్పై ఏళ్ల పాటు నిరంతరం రైతుకు ఫలసాయం వస్తుంది
- పామాయిల్ పంటల్లో అంతర పంటలుగా వేసి వాటితోనూ లాభాలను సంపాదించుకోవచ్చు.

రైతుకు రాయితీలు

ఆయిల్‌పామ్ సాగులో రెండు రకాల మొక్కలను సాగు చేసేందుకు ఉపయోగిస్తారు. స్వదేశీ రకం ఒక్కో మొక్కకు రూ.133లు, దిగుమతి రకం మొక్కకు రూ.193లు రాయితీని ప్రభుత్వం అందిస్తుంది.ఒక ఎకరాకు 60 మొక్కలు చొప్పున నాటాలి. ఒక్క ఎకరాకి ఇండిగోనియస్ రకానికి రూ.8వేలు సబ్సిడీ, ఎగుమతి రకానికి రూ.11,600లు చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది.

రైతులకు ప్రోత్సాహం



ఆయిల్ పామ్ మొక్క కొనుగోలుకు ప్రభుత్వం స్వదేశీ రకానికి రూ.20వేలు, దిగుమతి రకానికి రూ.28,400 రాయితీ కల్పించింది. మొదటి నాలుగేళ్లకు ఖర్చుల కోసం ఏడాదికి రూ.5250లు చొప్పున హెక్టారుకు రూ.21 వేలు, అంతర పంటలు పండించేందుకు మొదటి నాలుగేళ్లకు హెక్టారుకు రూ.21వేలు రాయితీ చెల్లిస్తుంది. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందుసేద్యం పరికరాలను కూడా చిన్న, సన్నకారు రైతులకు అందజేస్తుంది. జాబ్‌కార్డు ఉన్న చిన్న,సన్నకారు రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తోంది.

పేడాద జయశ్రీ, హెచ్‌టీఓ, ఐటీడీఏ, సీతంపేట

పందెంరాయుళ్ల అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో కోడి పందాల స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. తంగుడుబిల్లి గ్రామశివార్లలో కోడి పందాలు జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది రైడ్ చేయగా చెరువు సమీపంలో కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు కోడి పుంజులు, రూ.1510 నగదు సీజ్ చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని ఎస్సై తెలిపారు. కాగా సంక్రాంతి నేపథ్యంలో మండలంలోని తంగుడుబిల్లి, ఏటీ అగ్రహారం, మల్యాడ, తదితర గ్రామాల్లో కోడి పందాలు జోరుగా కొనసాగుతున్నాయి.

సామాజిక మరుగుదొడ్లు నిర్మాణం అవసరం

పార్వతీపురం: జిల్లాలో సామాజిక మరుగుదొడ్లు నిర్మాణం అవసరం వుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ అధికారులు, కలెక్టర్‌లతో స్వచ్ఛతపై వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను స్వచ్ఛత దిశగా తీర్చుదిద్దుతున్నట్లు తెలిపారు. దీనికోసం స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ సలహాదారు శ్రీనివాసన్ సహాయాన్ని కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో వలంటీర్లును నియమించి స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పార్వతీపురంలో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి నిర్దేశిత సంస్థ వచ్చి చేపట్టాల్సి వుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.